# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా భారత్ అవతరించేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14 పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.**

**3.** **వికసిత్ భారత్ లక్ష్య సాధనలో వ్యవసాయ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు గుంటూరు జిల్లాలోని రాజధాని ప్రాంతంలో పర్యటిస్తారు.**

**5.** **తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టి-శాట్ ఛానెల్ ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేస్తున్నట్లు టి-శాట్ సంస్థ వెల్లడించింది.**

**6.** **ఈరోజు ప్రపంచ శరణార్థుల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ప్రపంచంలో అత్యంత ప్రముఖ విజ్ఞాన కేంద్రంగా భారత్ అవతరించేలా అధునాతన ఉన్నత విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బీహార్‌లోని రాజ్ గిర్‌లో నలంద విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణాన్ని ప్రధానమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నలంద విశ్వవిద్యాలయం భారతదేశ వారసత్వానికి, సంస్కృతికి చిహ్నమని పేర్కొన్నారు. పురాతన శిథిలాల నుంచి నలంద విశ్వవిద్యాలయం పునరుజ్జీవించిందని కొనియాడారు. ఈ నూతన ప్రాంగణం భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తోందన్నారు. 21వ శతాబ్దం ఆసియా ఖండానిదేనని, దీనిలో తనవంతు పాత్ర పోషించేందుకు భారత్ ఎదురుచూస్తోందని చెప్పారు. కాగా ఐదో శతాబ్దంలో స్థాపించిన ఈ నలంద విశ్వవిద్యాలయం దాదాపు 8వందల సంవత్సరాల పాటు సేవలు అందించింది. 2016లో ఈ విశ్వవిద్యాలయ ప్రాంతాన్ని ఐక్యరాజ్యసమితి వారసత్వ సంపదగా ప్రకటించింది.

--------------------------

కేంద్ర ప్రభుత్వం 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న

జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. వరి కనీస మద్దతు ధరను క్వింటాలుకు 117 రూపాయలు, నువ్వులు 632 రూపాయలు, కందులు 550 రూపాయలు మేర పెంచినట్లు తెలిపారు. తాజా పెంపుతో రైతులకు అన్ని పంటలపై 50% అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. అలాగే మహారాష్ట్రలోని వధావన్ ఓడరేవును అభివృద్ధితోపాటు, గుజరాత్, తమిళనాడులలో మొదటి ఆఫ్‌షోర్ విండ్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు.

--------------------------

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో వ్యవసాయ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. బాపట్లలో నిర్వహించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు, ఉత్తమ శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యవసాయ రంగంలో వస్తున్న అనూహ్య మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెరుగుతున్న జనాభా, ప్రతికూల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ తదితర నూతన సాంకేతికతలపై దృష్టి సారించాలని చెప్పారు. పంటల దిగుబడులు పెంచడం ద్వారా రైతు సంక్షేమానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు గుంటూరు జిల్లాలోని రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాలో రాజధాని ప్రాంతంలో పర్యటించి నిర్మాణాల స్థితిగతులను తెలుసుకోనున్నారని, ఉండవల్లి నివాసం ఈ ఉదయం పర్యటన ప్రారంభం అవుతుందని తెలిపారు. ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తారని అనంతరం సీడ్ యాక్సిస్ రోడ్డు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాల నిర్మాణాల కోసం పనులు మొదలుపెట్టిన ప్రాంతాలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు.

--------------------------

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆధునిక సాంకేతికతో కూడిన విద్యను అందించేలా డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేస్తున్నట్లు తెలంగాణ నైపుణ్య విద్యా శిక్షణ సంస్థ–టి–సాట్ సీఈవో బి.వేణుగోపాల్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆయన నిన్న మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన బ్రిడ్జి కోర్స్‌లో భాగంగా ఈ రోజు నుంచి ఈనెల 30వ తేదీ వరకు టి–సాట్ విద్య ఛానల్‌లో ఆదివారం మినహాయించి తొమ్మిది రోజులు పాఠ్యాంశ ప్రసారాలుంటాయని వివరించారు. 30 నిమిషాల నిడివిగల పాఠ్యాంశాలు ఉదయం 10 గంటలకు మూడో తరగతి విద్యార్థుల నుంచి ప్రారంభమై 10వ తరగతి విద్యార్థుల వరకు డిజిటల్ పాఠాలు కొనసాగుతాయని చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలకు అనుబంధంగా ఈ డిజిటల్ పాఠ్యాంశాల ప్రసారాలు కొనసాగనున్నాయని తెలిపారు.

--------------------------

మరావతిలో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంపై కమిటీలు వేసి రాజధానిలో జరిగిన నష్టాన్ని పరిశీలిస్తామని

పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. తాడేపల్లిలో ఆయన నిన్న మాట్లాడుతూ.. పనులు ఎప్పటి నుంచి ప్రారంభించాలనేది మంత్రివర్గంలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ...

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయవ్యవస్థ స్థానంలో నూతనంగా రూపొందించిన మూడు నేర చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి, నేరశిక్షా స్మృతి, భారత సాక్షాధార చట్టం 1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, భారతీయ సాక్షా చట్టాలను వర్తింపజేయనున్నారు. ఆమోదం అనంతరం గత ఏడాది డిసెంబర్ 25న రాష్ట్రపతి సంతకంతో అవి చట్టం దాల్చాయి. ఈ నూతన నేరచట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఈరోజు ప్రపంచ శరణార్థుల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. వివిధ దేశాలకు శరణార్థులుగా వెళ్లే వారి సంక్షేమాన్ని కాంక్షించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. “శరణార్థులకు సంఘీభావం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ శరణార్థుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. శరణార్థుల దినోత్సవం రోజున శరణార్థులందరినీ గౌరవించడం, వారి గురించి అవగాహన పెంచడం, వారికి మద్దతు తెలపడం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. వారు ఎదుర్కొంటున్న కష్టాలు, అమానవీయ పరిస్థితులు, వాటి వెనుక ఉన్న కారణాలు, వీటన్నిటిని గురించి ప్రపంచ మానవ సమాజానికి తెలియజేసి అవగాహన కల్పించేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకుని శరణార్థులకు మానసిక స్థైర్యాన్ని అందించాలన్నదే ఐక్యరాజ్య సమితి ఉద్దేశ్యం.

---------------------------

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు రహదారులు నిర్మాణం తప్పనిసరి అని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైద్రాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాలశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రోడ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వల్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అలాగే ప్రాంతీయ రింగ్ రోడ్డు ద్వారా అంతకుమించిన అభివృద్ధి జరుగుతుందన్నారు.

---------------------------

దేశంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వ్యవసాయాధారిత పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

=====================